క్లుప్తంగా

చట్టాలపై అవగాహన తప్పనిసరి

• హెచ్ఎం శంకరరావు



గాదెలవలస ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం శంకరరావు

సీతానగరం: మహిళలకు రక్షణగా ఉండే చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం శంకరరావు అన్నారు. గాదెలవలస ఉన్నత పాఠశాలలో ఎస్సై ఎం. రాజేష్ అధ్యక్షతన 'శాంతిభద్రతల పరిరక్షణ – మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నిర్మూలన' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శంకరరావు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే చట్టాల గురించి తెలుసుకోవడం మంచిదన్నారు. ఎస్సై రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థుల రక్షణకు ఎన్నో చట్టాలున్నాయని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై కూడా అవగాహన ఏర్పరచుకోవడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండలంలోని సచివాలయాల్లో గల ఆధార్ కేంద్రాలు మూలకు చేరడంతో 'పని చేయని ఆధార్‌కేంద్రాలు' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆధార్‌సెంటర్లలోని ల్యాప్‌టాప్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంటిపేట, బూర్జ, జోగింపేట సచివాలయాలకు చెందిన ల్యాప్‌టాప్‌లను సరిచేశారు. ఆధార్ కార్డుల్లోని తప్పొప్పులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అధికారులు స్పందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణం, మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ గోపాలరావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ సబ్‌స్టేషన్, బాగువలస ఫీడర్, టౌన్ ఫీడర్, తదితర ఫీడర్లలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం ఏడు గంటలకు మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం జయకుమార్

మక్కువ: మండల కేంద్రంలోని వెలుగు మహిళా సమాఖ్య భవనంలో ఉల్లాస్ కార్యకమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం జయకుమార్ మాట్లాడుతూ.. వయోజన విద్యా వలంటీర్లు నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతోనే జ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి..

సాలూరు: పట్టణంలోని పెదబజార్ దుకాణదారులు షాపుల లీజు బకాయిలు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆర్ఐ నారాయణరావుతో కలిసి గురువారం ఆయన పెద్దబజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బకాయిలు చెల్లించని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉంటే పలువురు వ్యాపారులు సుమారు లక్షా ఇరవై వేల రూపాయలను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చెల్లించారు.

సమస్యలను పరిష్కరించండి

• నిరసన వ్యక్తం చేస్తున్న 108 సిబ్బంది



నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

బలిజిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని మండల పరిధిలోని 108 ఉద్యోగులు కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సిబ్బందిని వైద్యారోగ్యశాఖలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, మూడు షిఫ్టుల విధానం అమలు చేయాలని కోరారు. పెండింగ్ జీతాలు, గ్రాట్యుటీ, ఇంక్రిమెంట్లు వెంటనే చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించని ఎడల ఈ నెల 25 నుంచి సమ్మె తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఎంటీలు ఆర్. ధనుంజయ నాయుడు, సత్యనారాయణ, శంకరరావు, పైలట్లు జి. జోగేశ్వరరావు, కె. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

• కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ..



కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని చినబోగిలి గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై పెడుతున్న కేసులను ఖండించారు. కార్యకర్తలు చేపట్టిన ఏ కార్యక్రమానికైనా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జి, పార్టీ మండల సీనియర్ నాయకుడు జి. శ్రీరాములునాయుడు, చినబోగిలి సర్పంచ్ కురమాన రాధ, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, ఎస్. రాము పాల్గొన్నారు. – సీతానగరం

• ప్రణాళికల ఆధారంగా పనులు..

పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు 2024 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాల మేరకు పనులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు, డీపీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

– సీతానగరం



• ముడుపుల పూజలు

సీతానగరం మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ సముదాయంలో గల లక్ష్మీనృసింహస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గురువారం ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
– సీతానగరం



ఘనంగా బాలల దినోత్సవం..

పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటామని వక్తలు వివరించారు. కొన్ని చోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు. – పాచిపెంట/బలిజిపేట/మక్కువ



పాచిపెంట: భీమన్నదొరవలసలో ర్యాలీ చేస్తున్న నీడ్ సంస్థ ప్రతినిధులు, పిల్లలు



మక్కువ: చిన్నారుల నృత్య ప్రదర్శన



బలిజిపేట: వెంగళరాయపురంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, చిన్నారులు



మక్కువ: మోడల్ పాఠశాలలో నెహ్రూ చిత్రపటం నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు

పోలీసులకు సహకరించండి..

• ఎస్సై సింహాచలం

బలిజిపేట: సైబర్ నేరాల నివారణకు పోలీస్‌శాఖకు ప్రజలు సహకరించాలని ఎస్సై సింహాచలం కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో సైబర్ నేరాలు జోరుగా సాగుతున్నాయన్నారు. అనవసర లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. ఎటువవంటి అనుమాన మెసేజ్ వచ్చినా 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సుందర పార్వతీపురం అందరి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంపై రెండో రోజు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మృత్యుంజయ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం, వెంకటరాయునిపేటను సుందర పార్వతీపురంగా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరూ క్రమశిక్షణతో పనిచేసి తడి, పొడి చెత్తను వేరుచేసి వాహనాలకు అందించాలన్నారు. చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారుచేసి మరలా వినియోగించుకోవచ్చని సూచించారు. బలిజిపేటకు సుమారు రూ.3.25 కోట్ల నిధులను మురుగు కాలువల నిర్వహణ కోసం, మరమ్మతుల కోసం మంజూరు చేసినట్లు చెప్పారు. స్వచ్ఛాంధ్ర సలహాదారు సి.శ్రీనివాసన్ మాట్లాడుతూ.. చెత్తను సంపదగా మార్చాలన్నారు. నిల్వ ఉంచిన చెత్తను 12 గంటల లోపు డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారులు డి. గోపాలకృష్ణ, రమేష్‌రామన్, తదితరులు పాల్గొన్నారు.



తడిచెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర సలహాదారు శ్రీనివాసన్

గంజాయి సాగు నేరం



దుగ్గేరు వారపుసంతలో అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు

• ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు

మక్కువ: అటవీ పోడుభూముల్లో గంజాయిసాగు చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు తెలిపారు. మండలంలోని దుగ్గేరులో గురువారం జరిగిన వారపుసంతలో సాలూరు ఫారెస్ట్ రేంజర్ కె.తవిటినాయుడు ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ, ఏఓబీ సరిహద్దు గ్రామాలకు చెందిన గిరిజనులు పోడు భూముల్లో చిరుధాన్యాలు సాగు చేసుకోవాలే తప్ప, ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేసే గంజాయిని సాగు చేయరాదని సూచించారు.
అలాగే గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా ఎదుర్కోవాల్సిన ఇబ్బందులుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు శ్రీనివాసరావు, గణపతి, సతీష్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

• మక్కువ ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి

సాలూరు రూరల్: పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని మక్కువ ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిపల్లి బాలికల గిరిజన వసతిగృహాన్ని గురువారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల గదులను పరిశీలించారు. వారి విద్యాసామర్థ్యాలను అంచనా వేశారు. చదువుకునేందుకు వీలుగా లైట్లు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. రక్తహీనత రాకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని విద్యార్థినులను సూచించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

నైతిక విలువలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఎం.రాణి

• ఏఎస్పీ అంకిత సురాన

పార్వతీపురం: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. బెలగాంలోని డీవీఎం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. చిన్నపిల్లలచే పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి మాట్లాడుతూ.. ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ధరలు తగ్గించండి..

• సీపీఎం నాయకులు

సాలూరు: నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే అదుపుచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాపోరు కార్యక్రమం ముగింపులో భాగంగా గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్‌వై నాయుడు, శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని.. నిరుద్యోగభృతి కల్పిస్తామని.. ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని.. కరెంట్ చార్జీలు తగ్గిస్తామని.. నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని హామీలిచ్చి నేడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పట్టణంలోని రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఐటీఐ, గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలన్నారు. కురుకూటిలో నిర్మించాలనుకుంటున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, సంగీత, శంకర్, వెంకన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి..

బలిజిపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మన్మథరావు, సత్యనారాయణ మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపడం సరికాదన్నారు. అన్ని రంగాల్లోనూ కూటమి ప్రభుత్వం విఫలమవ్వడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, వెంకటస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.



సాలూరు: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

మక్కువలో..

మక్కువ: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ, ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఉచిత ఇసుక విధానం పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పిట్టల సీతారాం, చంటి, తదితరులు పాల్గొన్నారు.



మక్కువ: ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజలపై భారం తగదు..

సీతానగరం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులపై భారం వేయడం తగదని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి లక్ష్మున్నాయుడు, జీవీ రమణ, ఆర్. రాము, బి. అప్పారావు, వై. రామారావు, వై. ఈశ్వరరావు, పి. చిన్నారావు పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ఈశ్వరరావు

మద్యం సీసాలు స్వాధీనం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ పద్మావతి

సీతానగరం: బలిజిపేట మండలంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం దాడులు చేపట్టి ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 175 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీతానగరంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డి. పద్మావతి మాట్లాడుతూ, అనుమతుల్లేకుండా మద్యం విక్రయాలు చేపట్టరాదన్నారు. వైన్‌షాపుల్లో కూడా ఎంఆర్‌పీకే మద్యం విక్రయించాలని సూచించారు.